## ఎమ్మెల్యే జీఎస్ఆర్ సొంత మండలంలో తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు

కృష్ణకాలనీ, (గణపురం), జూన్ 6 : గణపురం మండలంలో ప్రజలు తాగునీటికి కోసం అల్లాడుతున్నారు. పరశురాంపల్లి గ్రామ పంచాయతీ పరిధి రవినగర్‌లో మహిళలు, గ్రామస్తులు ఖాళీ బిందెలతో రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఉల్లంగుల తిరుపతి, కంకణాల సాయిలు మాట్లాడుతూ వారం రోజులుగా గ్రామానికి మిషన్ భగీరథ నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో బోర్లు ఉన్నా అవి పనిచేయడంలేదని వాపోతున్నారు. దీంతో సుమారు కిలోమీటర్ దూరం వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. మిషన్ భగీరథ అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఓ మాజీ ప్రజాప్రతినిధి భర్త సుమారు 200 మీటర్ల దూరంలో ఉన్న మిషన్ భగీరథ పైప్ లైన్‌కు సొంత ఖర్చులతో పైపులు వేసుకోవాలని చెప్తున్నారని మండిపడ్డారు. పైప్‌లైన్ వేసుకోకుంటే గ్రామానికి మంచినీళ్లు రావా అని వారు నిలదీసున్నారు. ఇటీవలే గ్రామ సందర్శనకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కు తమ సమస్య చెప్పుకుందామని ప్రయత్నం చేయగా మాజీ సర్పంచ్ మంజుల భర్త భాస్కర్‌రావు తమను భయభ్రాంతులకు గురి చేశాడన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తన సొంత మండలంపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ధర్నాలో కుంభం మానస, పోలు స్వరూప, కంకణాల వరలక్ష్మి, మల్లయ్య పాల్గొన్నారు.


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న రవినగర్ గ్రామస్తులు

## హ్యాండ్ బాల్ పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్


మెడల్స్‌తో క్రీడాకారులు

ఏటూరునాగారం, జూన్ 6 : నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం మంగళపల్లిలో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన క్రీడాకారులు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు కోచ్ పర్వతాల కుమార స్వామి తెలిపారు. వరంగల్ బాలికల టీం గోల్డ్ మెడల్, బాలుర టీం సిల్వర్ మెడల్స్ సాధించిందన్నారు. ఇందులో ఏటూరునాగారానికి చెందిన జాడి రాధిక గోల్డ్ మెడల్, బాలుర టీం నుంచి ఎండీ ఇమ్రాన్, జాడి వాసుకు సిల్వర్ మెడల్ వచ్చిందన్నారు. క్రీడాకారులను క్రీడలశాఖ అధికారి తుల రవి, రాష్ట్ర హ్యాండ్ బాల్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ అభినందించినట్లు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

భూపాలపల్లి రూరల్, జూన్ 6 : భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి మండలం ఎస్ఎం కొత్తపల్లి, చిట్యాల మండలం దూతపల్లి గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ఆయన పరిశీలించి అర్జీదారుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? వాటిని ఆన్‌లైన్, రిజిష్టర్‌లో నమోదు చేస్తున్నారా ? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్వీకరించిన దరఖాస్తులను రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్ డెస్కులు, రిజిస్టర్లను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమాల్లో భూపాలపల్లి, చిట్యాల తహసీల్దార్లు శ్రీనివాసులు, ఇమాం పాషా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాన్ని ఢీకొన్న లారీ

కాటారం, జూన్ 6 : మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని శుక్రవారం తెల్లవారుజామున బొగ్గు లారీ ఢీకొట్టింది. స్థానికుల కథనం ప్రకారం.. భూపాలపల్లి నుంచి కాటారం వైపుగా వస్తున్న బొగ్గు లారీ మండలకేంద్రంలో అదుపుతప్పి విగ్రహాన్ని ఢీకొంది. ప్రమాదంలో విగ్రహం దెబ్బతిని ఒక పక్కకు ఒరిగింది. ఘటనపై విచారణ చేయాలని పద్మశాలి సంఘం నాయకులు కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME & DATE OF BIRTH
I, KUDULLA VARALAXMI W/o Late Rammurthy, R/o. H.No: 1-15, Vennaram (V), Dornakal (M), Mahabubabad Dist, T.G. Changed my son Name & Date of Birth KUDURLLA YESANNA INSTEAD OF KUDULLA PRAVEEN KUMAR AND ALSO HIS DATE OF BIRTH RECORDED AS 01-01-2010 INSTEAD OF 28-01-2010 for all purposes.

PLOTS FOR SALE
★ఆల్ డెవలప్‌మెంట్ D.T.C.P లే-అవుట్, 1) యాదగిరి, 2) ఘట్‌కేసర్, 3) బెంగుళూర్, 4) బొంబాయి, 5) విజయవాడ, HYD హైవేలో తక్కువ ధరకు లభించును. సెల్: 9989552041, 7095401585
NTW-000

WANTED
★హనుమకొండలో గల ప్రముఖ కార్ డెకార్స్ నందు పనిచేయుటకు కార్ ఎలక్ట్రీషన్స్, సూపర్‌వైజర్స్ (Female) మరియు కార్ వాషింగ్ చేయుటకు Male/Female వర్కర్స్ కావలెను. సెల్: 7995621165, 6303776310.
NTW-307

WANTED
★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565


ములుగు రూరల్ : జెండా ఊపి బడిబాట ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ దివాకర


కృష్ణకాలనీ : సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రాజేందర్

# పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలి

- ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర
- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో బడిబాట

ములుగు రూరల్, జూన్ 6 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ బోధనను క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన తీరును కూడా బడిబాటలో ప్రచారం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో డీఈవో పాణిని, సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్లు అర్షం రాజు, గ్యాదరి రమాదేవి, గుళ్లపల్లి సాంబయ్య, వయోజన విద్య జిల్లా కో ఆర్డినేటర్ వేణుగోపాల్, ఎంఈవో వజ్జ తిరుపతి, హెచ్ఎంలు వినోద్‌కుమార్, ఝాన్సీ, ఉమాదేవి పాల్గొన్నారు. అలాగే రాయినిగూడెం, సర్వాపురం, పెగడపల్లి, అంకన్నగూడెం, జగ్గన్నగూడెం, కన్నాయిగూడెం, కాసిందేవిపేట, రాంనగర్, కొత్తూరు గ్రామాల్లోని విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యపై ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. హెచ్ఎంలు ఈరూలాల్, స్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఉపాధ్యాయులు రఘుశర్మ, గోపిసింగ్, నారాయణ, బాలు, సాంబయ్య, ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

### బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

కృష్ణకాలనీ, (గణపురం) : బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ అన్నారు. మండలకేంద్రంలోని చెంచు కాలనీలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బడి ఈడు పిల్లలు ఉన్న ఇండ్లకు వెళ్లి అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కరపత్రాలు అందించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం దేసు సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈవో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అనుభవం ఉన్న ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారని చెప్పారు. మధ్యాహ్న భోజనంతో పాటు ఉచితంగా రెండు జతల యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, సీఎంవో రమేశ్, ఎంఈవో ఊరుగొండ ఉప్పలయ్య, ప్లానింగ్ కో ఆర్డినేటర్ రాజగోపాల్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తిరుపతి, ఎంపీపీఎస్ హెచ్ఎం దూలం కుమారస్వామి, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ కిషన్‌రెడ్డి బాబా పాల్గొన్నారు.

### ప్రవేశాలను పెంచాలి

మహదేవపూర్, (కాళేశ్వరం)/ గోవిందరావుపేట/ వాజేడు/ మంగపేట/ మల్హర్/ మొగుళ్లపల్లి : ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలను పెంచాలని ఎంఈవోలు ప్రకాశ్‌బాబు, జీ దివాకర్, మేనక, లక్ష్మణ్‌బాబు, ఎల్ కుమారస్వామి, మంగపేట తహసీల్దార్ రవీందర్ సూచించారు. శుక్రవారం ఆయా మండలాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆవరణలో బడిబాటపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. వాజేడు మండలకేంద్రంలోని నాగారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు ఎంపీపీఎస్ వాజేడు, నాగారం, జీపీఎస్ జంగాలపల్లి పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలపై అవగహన కల్పించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. అలాగే 15 ఏండ్లకు పైగా ఉన్న డ్రాప్ అవుట్ పిల్లలను ఓపెన్ స్కూల్‌లో చేర్చి చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, కాంప్లెక్స్ హెచ్ఎం బండం రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మహేశ్, కల్పన, హెచ్ఎంలు సోమిరెడ్డి, కొర్ర రఘురాం, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, వీవోలు సహసిని, లలిత, తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్, వైద్యాధికారి అల్లి మధుకర్, హైస్కూల్ హెచ్ఎం సోయం ఆనందరావు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం కొట్టెం సునీత, ఉపాధ్యాయులు పోరిక స్వరూప్‌సింగ్, గొంది విష్ణుప్రియ, యానక కవిత, రాజ్యలక్ష్మి, శ్రీకాంత్, మల్లయ్య, కుమార్, తాడిచర్ల హెచ్ఎం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

# వ్యాపారులకు సైబర్ కాల్స్ !

ఏటూరునాగారం, జూన్ 6 : పరిచయం, చనువు ఉన్నట్లుగా మాట్లాడుతూ కొందరు సైబర్ నేరగాళ్లు వ్యాపారుల నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. గత రెండు, మూడు రోజులుగా కొందరు వ్యాపారులకు ఈ కాల్స్ వచ్చినట్లు మండలంలో జోరుగా చర్చ జరుగుతున్నది. వివరాల్లోకి వెళితే.. ఓ వైద్యశాల డాక్టర్ పేరు చెప్పి మరొక వైద్యశాల డాక్టర్‌కు కాల్ చేసి రూ.3వేలు ఫోన్ పే చేస్తాను నగదు కావాలంటూ కాల్ వచ్చింది. ఈ కాల్‌లో మా నర్సుతో మీ వైద్యశాలకు డబ్బులు పంపిస్తాను. ఫోన్‌పే ద్వారా తనకు డబ్బులు పంపించండి.. ఏమైనా చార్జీలు ఇవ్వమంటారా ? అంటూ సంభాషించారు. చార్జీలు అక్కర్లేదు నగదు పంపిస్తే ఫోన్ పే చేస్తానంటూ మరో వైద్యశాల డాక్టర్ చెప్పాడు. నర్సు నగదు తీసుకురాకపోవడంతో సదరు డాక్టర్ ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించలేదు. కొద్ది సేపటి తర్వాత ఆరా తీస్తే ఇది ఫేక్ కాల్‌గా తేలింది. ఇదిలా ఉండగా మీ ఎదురుగా ఉన్న వైద్యశాల డాక్టర్‌ను మాట్లాడుతున్నా.. మీ వద్ద ఫోన్ పేలో డబ్బులు ఉంటే పంపించండి నేను నగదు పంపిస్తాను.. అంటూ ఓ జువెల్లరీ షాపు యాజమానికి కాల్ వచ్చింది. షాపు యాజమాని భార్య కాల్ లిఫ్టు చేసి మాట్లాడారు. ఎదురుగా ఉన్న డాక్టర్ కదా అనుకుని అతను చెప్పిన ఫోన్ నంబర్‌కు రూ.3వేలు ఫోన్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసింది. ఆ తర్వాత ఎదురుగా ఉన్న డాక్టర్‌ను సంప్రదిస్తే తాను కాల్ చేయలేదని, డబ్బులు పంపించమని తాను అడగ లేదని స్పష్టం చేశారు. దీంతో సదరు మహిళ సైబర్ నేరానికి గురైనట్లు తెలుసుకుంది. తనకు కాల్ వచ్చిన నంబర్‌కు ఫోన్ చేస్తే ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి ట్రూ కాలర్‌లో ట్రేస్ అవుట్ చేస్తే ఏపీ అడ్రస్ చూపిస్తున్నది. ఇక, ఇలాగే మరో ముగ్గురు వ్యాపారులకు కూడా కాల్స్ వచ్చినట్లు తెలుస్తున్నది. ఇందులో కొందరు స్పందించగా మరి కొందరు స్పందించనట్లు సమాచారం. ఎదుటి వ్యక్తి అడుగుతున్న నగదును బట్టి సందేహాలు కూడా రావాలని, సైబర్ నేరగాళ్లు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఫోకస్ చేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని పోలీసులు పేర్కొంటున్నారు.

## మహదేవపూర్ తహసీల్దార్‌గా రామారావు

మహదేవపూర్, జూన్ 6 : మండల నూతన తహసీల్దార్‌గా వై రామారావు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టేకుమట్ల మండలంలో తహసీల్దార్ గా పనిచేసిన ఆయన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా ముదిగొండలో పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతకు ముందు పనిచేసిన ప్రహ్లాద్ రాథోడ్ అసిఫాబాద్‌కు బదిలీ అయ్యారు. రామారావుకు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, రెవెన్యూ సిబ్బంది శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, భూభారతి కంప్యూటర్ ఆపరేటర్ చెన్నూరి సాయి, కిశోర్, ఆసిఫా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇందిరమ్మ దరఖాస్తుదారులు

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

మంగపేట, జూన్ 6 : నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని మండలంలోని కమలాపురానికి చెందిన ప్రజలు ఉన్నతాధికారులను కోరారు. గురువారం వారు మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. గతంలో ఇందిరమ్మ ఇండ్లు వచ్చి వాటిని ఇతరులకు అమ్ముకున్న వారికే మళ్లీ ఇండ్లు మంజూరు చేశారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. రాజకీయ ప్రమేయం లేకుండా ప్రస్తుత నివాస పరిస్థితిని అధికారులు క్షేత్రస్థాయి సర్వే ద్వారా పరిశీలించిన తర్వాతే మంజూరు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చిన ఇండ్లను ఇతరులకు అమ్ముకునే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని అధికారులు గుర్తించాలని వారు కోరారు.

## నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

గోవిందరావుపేట, జూన్ 6 : ఫర్టిలైజర్, సీడ్స్ షాపుల డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని పస్రా సీఐ జీ రవీందర్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారి జితేందర్‌రెడ్డి, ఎస్సై కమలాకర్‌తో కలిసి డీలర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విక్రయాలకు సంబంధించిన రికార్డులు, బిల్లు బుక్స్ ఉండాలన్నారు. అవకతవకలకు పాల్పడినా, నకిలీ విత్తనాలు విక్రయించినా కఠిన చర్యలతో పాటు పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ఉరేసుకొని బాలిక ఆత్మహత్య

మంగపేట, జూన్ 6 : మండలంలోని కమలాపురానికి చెందిన అన్నం లిఖిల (16) శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. లిఖిల గత మార్చిలో స్థానిక ఆర్ఎంసీ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నది. తల్లి లక్ష్మీతిరుపతమ్మ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నది. లిఖిల ఇంటి పనులతో పాటు అమ్మమ్మ బాగోగులు కూడా చూస్తుంది. ఇంటి పనులతో పాటు, అమ్మమ్మ బాగోగులు కూడా చూసుకోవడాన్ని భారంగా భావించి జీవితం విరక్తి చెందిన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రం తల్లి కూలీ పనుల నుంచి ఇంటికి వచ్చి చూడగా కూతురు ఆత్మహత్య చేసుకొని మృతి చెంది కనిపించింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## టీబీ రహిత జిల్లాకు కృషి చేయాలి

ములుగురూరల్, జూన్ 6 : ప్రతి ఒక్కరిపై దృష్టి సారించి టీబీ రహిత జిల్లాకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయం వద్ద టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 100 రోజుల క్యాంపెయిన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దుర్గారావు, టీబీ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ సమ్మయ్య, చంద్రమౌళి, రాజు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలపై అవగాహన

ములుగురూరల్, జూన్ 6 : అంకన్నగూడెంలో ఉద్యానవన పంటల సాగు, రాయితీ పథకాలపై ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సమీకృత ఉద్యాన అభివృద్ధిలో భాగంగా 50 శాతం రాయితీపై వ్యవసాయ పని ముట్లు పొందవచ్చని సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ఒక్కో మొక్కకు రూ.20 కడితే రైతులకు ఎకరానికి 57 మొక్కలు అందించనున్నట్లు చెప్పారు. ఐదెకరాల్లోపు సన్నకారు రైతులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీపై బిందు సేద్యం పరికాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

## పేద కుటుంబానికి బీఆర్ఎస్ ఆర్థిక సాయం

వాజేడు, జూన్ 6 : మండలంలోని కృష్ణాపురం గ్రామంలోని నిరుపేద కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం నూగూరు వ్యవసాయమార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, పార్టీ మండల అధ్యక్షుడు పెనుమల్లు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పైపూరి భీమేశ్వర్‌రావుకు 50 కిలోల బియ్యం, రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ముడిగ తిరుపతియాదవ్, మాజీ సర్పంచ్ పునెం నాగచంద్ర, మాజీ ఎంపీటీసీ యాలం చిట్టిబాబు, మడే కృష్ణయ్య, అశ్వపతి పాల్గొన్నారు.


బియ్యం, నగదు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# వేర్వేరు ప్రమాదాల్లో ట్రాక్టర్, బైక్ దగ్ధం

కృష్ణకాలనీ, (గణపురం) జూన్ 6 : ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ట్రాక్టర్ దగ్ధమైంది. ఈ ఘటన గణపురం మండలం సీతారాంపురం గ్రామ పంచాయతీ పరిధి బంగ్లపల్లి గ్రామంలో జరిగింది. రైతు పంచనేని విష్ణువర్ధన్‌రావు శుక్రవారం ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌కు గురై డీజిల్ ట్యాంకర్ పేలి ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. దీంతో రైతు త్రుటిలో ప్రాణాపాయస్థితి నుంచి తప్పించుకున్నారు.


షార్ట్ సర్క్యూట్‌తో పొలంలోనే దగ్ధమవుతున్న ట్రాక్టర్

### రోడ్డు ప్రమాదంలో బైక్ దగ్ధం

వాజేడు : రోడ్డు ప్రమాదంలో బైక్ దగ్ధమైన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని పెద్దగొల్లగూడెం గ్రామ శివారు 163 జాతీయ రహదారిపై జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. వాజేడు వైపు నుంచి లక్ష్మీపురం గ్రామానికి కోరం అన్వేశ్ బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెద్దగొల్లగూడెం గ్రామ శివారులో జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం తవ్విన గుంతలో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. బైక్‌ను బయటకు తీసిన అనంతరం మంటలు చెలరేగి దగ్ధమైంది.


వాజేడు : మంటల్లో పూర్తిగా దగ్ధమవుతున్న బైక్

## పేదలకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే జీఎస్ఆర్

భూపాలపల్లి రూరల్, జూన్ 6 : పేద ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి మండలం కమలాపూర్, నాగారం, అజాంనగర్, నందిగామ, పంబాపూర్, దీక్షకుంట, దూదేకులపల్లి, గొల్లబుద్ధారం, రాంపూర్, కొంపెల్లి, గుడాడ్‌పల్లి, గొర్లవేడు, వజినేపల్లి, నేరేడుపల్లి, ఎస్ ఎం కొత్తపల్లి, మోరంచపల్లి, శ్యాంనగర్ గ్రామాల్లో ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం కమలాపూర్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రంజిత్ పాల్గొన్నారు.

## క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుంది

చిట్యాల, జూన్ 6 : క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సిరికొండ ప్రశాంత్ అన్నారు. మండలకేంద్రంలోని పీఏసీఎస్ మైదానంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సిరికొండ ఛాంపియన్‌షిప్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం గురువారం రాత్రి నిర్వహించగా ఆయన విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా, మొదటి విజేత కేకేఆర్ టీంకు ట్రోఫీతో పాటు రూ.40వేల నగదు, ద్వితీయ బహుమతిగా విక్టరీ లెవెన్ టీముకు ట్రోఫీతోపాటు రూ.20వేల నగదు అందజేశారు. బీఆర్ఎస్ జిల్లా నాయకులు చింతల రమేశ్, శశికాంత్ గౌడ్, జన్నె యుగేందర్, నిర్వాహకులు వేల్పుల రాజ్‌కుమార్, సాయి నితిన్, లవన్‌బాబు, కిరణ్, కోడెల సది పాల్గొన్నారు.


విజేత జట్టుతో సిరికొండ ప్రశాంత్

## ఇసుక క్వారీల్లో 'లోకల్ సీరియల్'

మహదేవపూర్ (కాళేశ్వరం), జూన్ 6 : మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఇసుక క్వారీల్లో లోకల్ సీరియల్ దందా జోరుగా సాగుతున్నది. మండలానికి చెందిన పలువురు స్థానికులు ఇసుక లోడింగ్‌లో దందాకు తెరలేపి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లారీలు నిర్దేశిత మార్గంలోనే లోడింగ్ వెళ్లాలని పోలీసులు డ్రైవర్లను హెచ్చరించినా వారు పట్టించుకోవడంలేదు. శుక్రవారం కొందరు వ్యక్తులు తాము లోకల్ అంటూ నిర్దేశిత మార్గం ద్వారా కాకుండా రాంగ్ రూట్లో నేరుగా ఇసుక క్వారీ వద్దకు లారీలను చేర్చుతూ ఒక్కో లారీకి రూ.వెయ్యి నుంచి రూ.2వేలు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసు కోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


## ముగిసిన శిక్షణ శిబిరాలు

కృష్ణకాలనీ, జూన్ 6 : జిల్లాలో నెల రోజుల నుండి నిర్వహించిన వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి చిర్ర రఘు గణపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడా క్యాంప్ ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. గణపురం బాల్ బ్యాడ్మింటన్ క్యాంపు ఇన్‌చార్జి రవీందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ములుగు ప్రభుత్వ వైద్యశాల అధ్వానం

- ఫ్యాన్‌లు లేక రోగుల ఇబ్బంది
- దవాఖానను సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు

ములుగు, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : ములుగు ప్రభుత్వ వైద్యశాలలో ఫ్యాన్లు లేక రోగులు ఇబ్బందిపడుతున్నారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులకు ఫిర్యాదు చేయగా, మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి నాయకులతో కలిసి వెళ్లి దవాఖానను సందర్శించారు. రోగుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వార్డుల్లో ఫ్యాన్లు లేక ఇబ్బందిపడుతున్నట్లు తెలిపారు. కొందరు రోగులు సొంతంగా టేబుల్ ఫ్యాన్లు తెచ్చుకున్నట్లు చెప్పారు. కాగా, ఈ విషయాన్ని వైద్యశాల సూపరింటెండెంట్‌కు ఫోన్‌లో తెలియజేయగా.., నిధులు లేవని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడని ఆరోపించారు. మంత్రి సీతక్క ఇలాకలో ప్రభుత్వ దవాఖాన పరిస్థితిని పట్టించుకునే వారే లేరని, ఐసీయూ వార్డులో ఏసీలు కూడా పనిచేయడం లేదన్నారు. కలెక్టర్ స్పందించి రోగులకు దవాఖానలో రోగులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు.


దవాఖానలో సొంతంగా ఏర్పాటు చేసుకున్న టేబుల్ ఫ్యాన్

## ప్రణాళికతో మొక్కలు నాటాలి : కలెక్టర్

ములుగురూరల్, జూన్ 6 : వన మహోత్సవం కార్యక్రమంలో వివిధ శాఖల వారిగా అధికారులు ప్రణాళికతో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. శుక్రవారం ఆయన వన మహోత్సవంపై అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల పరిసరాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. ప్రతీ ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేసి వాటిని సంరక్షించేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమీక్షలో డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వాజేడు ఎంపీడీవో విజయ బదిలీ

వాజేడు, జూన్ 6 : ఎంపీడీవో విజయ శుక్రవారం బదిలీ అయింది. ఆమె స్థానంలో ఎంపీవోగా పని చేస్తున్న శ్రీకాంత్ నాయుడుకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎంపీడీవో విజయను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా బదిలీ అయిన మాట వాస్తవమే అని ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదని చెప్పారు.

## రామన్నగూడెంలో గుర్తు తెలియని మృతదేహం

రేగొండ, జూన్ 6 : మండలంలోని రామాన్నగూడెం శివారులోని వ్యవసాయ భూముల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రామన్నగూడెం తండా శివారులోని పొలాల్లో అటుగా వెళ్లిన గ్రామస్తులకు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి శుక్రవారం సాయంత్రం పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు సుమారు 50 నుంచి 60 ఏండ్ల మధ్య వయస్సు, ఎత్తు 5.3 అడుగులు, శరీరంపై ఎలాంటి దుస్తులు లేవన్నారు. సమాచారం తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

## నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు 21 మంది అర్హత

భూపాలపల్లి రూరల్, జూన్ 6 : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ అర్హత పరీక్షలోజిల్లా విద్యార్థులు ప్రతిభను చాటారని డీఈవో రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది నవంబర్ నెలలో జరిగిన అర్హత పరీక్షకు జిల్లాలోని 55 పాఠశాలల నుంచి 425 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 21 మంది అర్హత సాధించారన్నారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతీ సంవత్సరం రూ.12 వేల స్కాలర్షిప్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను డీఈవో అభినందించారు.

## ఆడిటోరియం, మినీ స్టేడియం పనులు పూర్తి చేయాలి : కమిషనర్

భూపాలపల్లి రూరల్, జూన్ 6 : ఆడిటోరియం, మినీ స్టేడియం పనులను వెంటనే పూర్తి చేయాలని భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సుభాష్‌కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న మినీ స్టేడియం, ఆడిటోరియం పనులు, సైడ్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. పనులను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సుభాష్‌కాలనీలోని సైడ్ డ్రైనేజీ సరిగా లేదని వెంటనే సైడ్ డ్రైనేజీ పనులు చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## గిరిజన గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

కాటారం, జూన్ 6 : మండలంలోని గిరిజన బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 7 నుంచి 16 వరకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. బీపీసీలో 30 సీట్లు, ఎంపీసీలో 30 సీట్లకు అర్హత గల ఎస్టీ విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 94909 57308 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## 9న ఐటీఐలో పీఎం అప్రెంటీస్ మేళా

ఏటూరునాగారం, జూన్ 6 : స్థానిక ఐటీఐలో ఈనెల 9న పీఎం అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మేళాకు హైదరాబాద్‌లోని వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు రానున్నారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్, రెండు జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

## గిరిజన క్రీడా కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఏటూరునాగారం, జూన్ 6 : మండలకేంద్రంలోని గిరిజన బాలుర క్రీడా కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని గురుకులాల ఆర్సీవో హరిసింగ్, ములుగు డీసీవో శ్రీనువాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీపీసీ, ఎంపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, వొకేషనల్ ఎఅండ్‌టీ గ్రూప్ మొదటి సంవత్సరంలో పరిమిత సీట్లు ఉన్నాయన్నారు. కులం, ఆదాయం, స్టడీ, టీసీ ఒరిజినల్స్‌తో కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని వారు కోరారు.

## వార్డుల విభజన సక్రమంగా చేపట్టాలి

ములుగురూరల్, జూన్ 6 : ములుగు మున్సిపాలిటీలో వార్డుల విభజన సక్రమంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ సంపత్‌కు శుక్రవారం వీవర్స్ కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. తమ కాలనీని రెండు భాగాలుగా చేసి 7వ వార్డులో, 19వ వార్డులో సర్దుబాటు చేశారని, ఈ కారణంగా కాలనీ వాసులకు ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. వీవర్స్ కాలనీని ఒకే వార్డులో ఉండేలా చూడాలని కోరారు. సదానందం, రవీందర్, రామ్మూర్తి, రాజమల్లు, భాస్క ర్, మధు, రవి, అశోక్, సురేశ్, ప్రకాశ్, శ్రీను, రాజేశ్వరి ఉన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

ములుగురూరల్ (వెంకటాపూర్), జూన్ 6 : నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని, రైతులను కొనుగోలు చేసిన ప్రతీ దానికి రసీదు ఇవ్వాలని టాస్క్ ఫోర్స్ సీఐ బీ రమేశ్ అన్నారు. వెంకటాపూర్ మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తహసీల్దార్ గిరిబాబు, ఎస్సై సతీశ్‌తో కలిసి పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. బ్రోకర్లు, నకిలీ డీలర్లు కనిపిస్తే డయల్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఏవో శైలజ, ఏఈవో నాగరాజు ఉన్నారు.